కృత్రిమ మేధ...ఆకర్షణీయంగా కళ

డిజిటల్ ప్రపంచ ఆవిర్భావం తర్వాత మానవ జీవితంలో దాని ప్రమేయం లేని అంశమంటూ ఏదీ లేకుండా పోయింది. ఈ మేరకు కృత్రిమ మేధ (ఏఐ), ఉత్పాదక కృత్రిమ మేధ (జీఏఐ) వంటి డిజిటల్ యుగపు ఆవిష్కరణలు దైనందిన జీవితంలో అనుక్షణం తమ ఉనికిని చాటుతున్నాయి. అపార సాంకేతిక సౌలభ్యం వల్ల స్వల్ప కృషితో కళాత్మక వ్యక్తీకరణ మరింత ఆకర్షణీయం, ఆవిష్కరణాత్మకంగా రూపొందుతుంది. ఆ వివరాలను తెలుసుకుందాం.

- మానవ మేధ, కళ మధ్య అనాదిగా అవినాభావ సంబంధం ఉంది. ప్రాచీన కాలంలో కృత్రిమ మేధ తెలియదు. కానీ అద్భుత మేధాశక్తిని చాటే కళలెన్నో ఉన్నాయి. ఆదిమానవులు తమ తెలివితేటలతో కళాత్మకతను గణనీయంగా/ బొమ్మలు, బండ్లు, కుండలు, పాత్రలు, వస్త్రాలు, పూసలు వగైరాల తయారీతో పాటు కొయ్య చెక్కడాలు, గుహల్లో చిత్రలేఖనం వంటి కళారూపాలే ఇందుకు నిదర్శనాలు.
- సాంకేతికతను మార్పు సంబంధిత మానవ నైపుణ్యంగా నిర్వచిస్తే భారత ఉపఖండంలో 20 లక్షల ఏళ్లకు పైగా ముందునాటి రాతి పనిముట్లు అందుకు సాక్ష్యమిస్తాయి. భారతదేశంలో సార్వత్రిక శకానికి ముందు తొలి పట్టణీకరణ ఆరంభం నాటి హరప్పా నాగరికత ఓ కీలక ఉదాహరణగా నిలుస్తుంది.
- మేధతో ముడిపడిన కళలకు ఈ నాగరికతతో మనకెన్నో నిదర్శనాలు కనిపిస్తాయి. ఆనాటి ప్రజలు కొత్త వ్యవసాయ సాంకేతికతల అన్వేషణకు తగిన స్థాయిలో పురోగమించారు. కాబట్టే వారు అంతర పంటల సాగు పద్ధతిని కనుగొన్నారు.
- వారు కనుగొన్న చక్రం నమూనా కూడా ఆధునిక నాగరికతల వరకు మానవాళికి తోడ్పడింది. ఇక లోహ శాస్త్రంలో భాగంగా ముడి ఖనిజం నుంచి లోహం వెలికితీత కోసం నూతన సాంకేతికతలను వారు కనుగొన్నారు. మిశ్రమ లోహ సాంకేతికతనూ రూపొందించారు. తద్వారా రాగితో తగరాన్ని కలిపి కంచును తయారు చేశారు.
- హరప్పా ప్రజల కీలక ఆవిష్కరణల్లో 'మైనపు మూస' సాంకేతికత ఒకటి. ఈ పరిజ్ఞానంతో కళా సాంస్కృతిక రంగంలో వారు జీవం ఉట్టిపడే బొమ్మలకు ఊపిరి పోయడాన్ని ఒక మైలురాయిగా చెప్పవచ్చు. ఏదేమైనా ఈ డిజిటల్ యుగంలో మనం పురావస్తు పరిశోధనల్లో మెరుగైన ఫలితాల కోసం 'ఏఐ'ని ఉపయోగించుకుంటున్నాం.
- హరప్పా ప్రజలు మురుగు పారుదల వ్యవస్థ వంటి సకల ఆధునిక అంశాలతో అధునాతన గ్రిడ్ ఆధారిత పట్టణ ప్రణాళికను కూడా రూపొందించారు. భవనాల గోడలను మరింత బలమైనవిగా నిర్మించడం కోసం తగు నిష్పత్తిలో ఇటుకలను కూడా వారు ఉపయోగించారు.
- హరప్పా అనంతరం గంగా నదీ లోయల్లో రెండో పట్టణీకరణ చోటుచేసుకుంది. ఈ కాలంలో ఇనుము ఆధారిత విశిష్ట సాంకేతికత ఆవిష్కరణలు చోటుచేసుకున్నాయి. వీటిలో ఢిల్లీలోని ఉక్కు స్తంభం 1500 ఏళ్ల నాటిది కాగా దీన్ని 6 టన్నుల దుక్క ఇనుముతో రూపొందించారు. ఇందులో భాస్వరాన్ని కూడా మిశ్రమం చేశారు. ఇది సృజనాత్మక మేధతో కూడిన కళా ప్రతిభకు అద్భుత ఉదాహరణే గాక అధునాతన సాంకేతికతకు వాస్తవ నిదర్శనం. పైగా తుప్పు నిరోధక లక్షణం కలిగినది కావడం మరో విశేషం.
- ఒడిశాలోని పూరీ జగన్నాథ ఆలయాల్లో కూడా ఇదే సాంకేతికతను ఉపయోగించారు. అలాగే మధ్యయుగాల్లో మేధా కళాత్మకతను పరిశీలిస్తే దుర్భేధ్యమైన కోటల వంటి ప్రత్యేకతలతో కూడిన అనేక ఉదాహరణలు మన కళ్లెదుటే ఉన్నాయి.
- కళ, సంస్కృతి మన గుర్తింపును వ్యక్తీకరిస్తాయి. అలాగే సామాజిక విలువలు, సంప్రదాయాలు, విశ్వాసాలను ప్రతిబింబిస్తాయి. కళ ఆలోచనను రేకెత్తిస్తుంది. కార్యాచరణకు పురిగొల్పుతుంది. కళాకారులు తమ సృజనాత్మక వ్యక్తీకరణ ద్వారా సామాజిక సమస్యలకు పరిష్కారం చూపుతారు. న్యాయం పక్షాన గట్టిగా నిలబడతారు. సానుకూల సామాజిక మార్పును ప్రోత్సహిస్తారు.
- డిజిటల్ సాంకేతికత ముందంజ ఫలితంగా డిజిటల్ చిత్ర లేఖనం, లేఖన కళ (గ్రాఫిక్ డిజైన్), కదిలే బొమ్మల కళ (యానిమేషన్), పారస్పరిక మాధ్యమాలు (ఇంటరాక్టివ్ మీడియా) సహా కొత్త కళారూపాలు పుట్టుకొచ్చాయి.
- ఈ సాంకేతికత సద్వినియోగంలో భాగంగా 'ట్యాబ్లెట్, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్, డిజిటల్ కెమెరా' వంటి సాధనాలతో కళాకారులు అత్యద్భుత దృశ్య కళా ఖండాలకు జీవం పోస్తున్నారు. సంప్రదాయ పద్ధతులతో కష్ట సాధ్యం లేదా అసాధ్యం అనిపించినవన్నీ ఈ సాంకేతికత ప్రవేశంతో సులభ సాధ్యంగా మారాయి.

దృశ్య కళ

- ఇది స్వర్శానుభూతినిచ్చే ప్రత్యక్ష కళా రూపం. ఈ కళా రూపాలు సాధారణంగా కళాకారులు నేరుగా ప్రదర్శించే భౌతిక రూపంలో ఉంటాయి. ఇక దృశ్య కల్పనకు ఆవిష్కరించే సినిమా ఒక అద్భుత ఉదాహరణ. ఈ డిజిటల్ యుగంలో మన సాంస్కృతిక ప్రదేశాలు, సంప్రదాయ వస్త్రధారణ తదితరాల దృగ్గోచర కల్పన వ్యయంతో కొత్త సాంకేతికతలను వాడుకోవచ్చు. ఆధునిక సాంకేతికత తోడ్పాటుతో ఎవరైనా ఊహకు మించి దృశ్యీకరించే వీలుంటుంది. అందువల్ల మన కళా సంస్కృతుల ప్రదర్శనలో ముఖ్యంగా సినిమాల్లో ఈ కొత్త డిజిటల్ ఆవిష్కరణకు మద్దతు, వినియోగానికి సంబంధించి మనకో బలమైన కారణం ఉంది. నకిలీ లేదా వికృత వీడియోల వంటి అనుచిత చిత్రీకరణ కోసం కొన్ని సాంకేతికతలు దుర్వినియోగమయ్యే ముప్పు కూడా ఉందన్న వాస్తవాన్ని మనం గ్రహించాలి.

- ఒక విధంగా కళా సాంస్కృతిక రంగాల పునరావిష్కరణకు కొవిడ్-19 మహమ్మారి తోడ్పడింది. ఆ మేరకు కృత్రిమ మేధ వంటి ఉపకరణాలు కళాకారులకు అందుబాటులోకి వచ్చాయి. దీంతో నేడు వాస్తవిక సాదృశ్య (వర్చువల్) కళా ప్రదర్శనలు (ఎగ్జిబిషన్లు), వర్చువల్ కన్జర్వేటరీలు థియేటర్లు వంటివి వేగంగా, విరివిగా ఆవిర్భవించడాన్ని మనం గమనిస్తున్నాం.
- మానవాళి మనుగడకు మహమ్మారి సవాలు విసిరినప్పుడు కళా సాంస్కృతిక సంస్థలకు డిజిటల్ రంగం ప్రగతి కొత్త ఊపిరిలూదింది.
- వెబ్‌సైట్‌లు, సామాజిక మాధ్యమ వేదికలు, ఆన్‌లైన్ ప్రదర్శనశాలలు, కళా ఖండాల డిజిటల్ విక్రయశాలల వంటివన్నీ కళాకారులకు విస్తృత ప్రేక్షక లోకానికి చేరువ చేశాయి. వీటి వల్ల సహ సృష్టికర్తలతో పరస్పర సంధానంతో పాటు తమ కళాకృతులను నేరుగా సేకరణకర్తలకు విక్రయించే వెసులుబాటు కూడా వారికి లభించింది. భవిష్యత్తరాలకు డిజిటల్ కళా రూపాల దీర్ఘకాలిక సంరక్షణ, లభ్యతకు భరోసా ఇవ్వడానికి ఇవన్నీ అత్యావశ్యకం.
- ఈ డిజిటల్ యుగం కళాకారులకు, ఔత్సాహికులకు అనేక అవకాశాలు కల్పించడమే గాక అనేక సవాళ్లను కూడా తెచ్చిపెట్టింది. డిజిటల్ కళా సృష్టికి సంబంధిత ఉపకరణాలు, సాఫ్ట్‌వేర్ పరిజ్ఞానమే కాకుండా నైపుణ్యం లేకపోతే వారు డిజిటల్ కళా రంగంలో రాణించలేరు.
ఆన్‌లైన్‌లో డిజిటల్ కళా విస్తరణ నేపథ్యంలో కళాకృతుల నాణ్యత, ప్రామాణికతల గుర్తింపు కష్టతరమై నమ్మకం/ విశ్వసనీయత సంబంధిత సమస్యలకు దారితీస్తుంది.
- డిజిటల్ సంధాన పద్ధతులు మరింత అధునాతనంగా మారడంతో అసలు కళాకృతులు, డిజిటల్ నకిలీలు లేదా ప్రతిరూపాల మధ్య వ్యత్యాసం గుర్తించడం పెను సవాలుగా మారుతుంది. ఇక సమాచార గోప్యత, వ్యక్తిగత సమాచార సేకరణ నిల్వ, ఆర్థిక లావాదేవీల నిర్వహణ, సృజనాత్మక సారాంశం ఆన్‌లైన్‌లో పంచుకోవడం వగైరాలకు ఎదురయ్యే స్వాభావిక సవాళ్లు ప్రాథమిక ఆందోళనకర అంశాల్లో కీలకమైనవి. వీటన్నిటి రక్షణ కోసం బలమైన సైబర్ భద్రత చర్యలు, సమాచార రక్షణ విధి విధానాలు రూపొందించడం అవసరం.
- డిజిటల్ యుగం కళా ప్రపంచాన్ని పరివర్తనాత్మకం చేసింది. సృజనాత్మకత, సంయుక్త కృషి, ఆవిష్కరణలకు కొత్త బాటలు పరుస్తుంది. నిరంతర సాంకేతిక ప్రగతి ఫలితంగా డిజిటల్ కళాత్మకత విస్తరణ అవకాశాలు కూడా అపారంగానే ఉంటాయి. కళపై మన అవగాహనను పెంచడంతోపాటు సమాజంలో దాని స్థానం పునర్నిర్మాణానికి ఈ సాంకేతికత భరోసా ఇస్తుంది.
- సంప్రదాయ కళతో పోలిస్తే డిజిటల్ కళ 'పిక్సెల్' ఆధారితం, గత ఐదు దశాబ్దాల్లో కంప్యూటర్ పరిజ్ఞాన సాంకేతికత అభివృద్ధి ఫలితంగా డిజిటల్ కళ కూడా ముందంజ వేసింది. ఇంటర్నెట్ సాంకేతికత ముందంజతో సమాంతరంగా ప్రపంచ కళా ఉద్యమం కూడా పుంజుకుంటూ వచ్చింది. మనం ఇప్పటి సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక విలువలను గమనిస్తే కళ డిజిటల్ సాంకేతికతల మేళవింపు 'డిజిటల్ ఆర్ట్'గా వ్యవహరించే ఓ సరికొత్త పునరుజ్జీవిత కళా సృష్టికి దారి తీసిందని అర్థమవుతుంది. కాలక్రమంలో కళకు నిర్వచనం విస్తృతమైంది. పెయింటింగ్, డ్రాయింగ్, శిల్పాలకు మాత్రమే గాక కంప్యూటర్ సృష్టించే చిత్రాలు, ఆకృతులు కూడా ఇందులో అంతర్భాగంగా మారాయి.
- పెయింటింగ్, గ్రాఫిక్ డిజైన్, ఇన్‌స్టాలేషన్, యానిమేషన్‌లకు మాత్రమే కాకుండా కవిత్వం, సంగీతం, శిల్పకళలో కొత్త దృక్కోణాలను కూడా డిజిటల్ కళాత్మకత మన ముందుకు తెచ్చింది. సమకాలీన డిజిటల్ కళా రూపాల్లో కొత్త కళాత్మక భావనల అభివృద్ధిని ఈ పురోగమనం ప్రతిబింబిస్తుంది. ఈ డిజిటల్ కళాత్మక ప్రపంచ భాష విస్తరణకు దోహదం చేస్తుంది.
- కళా ప్రపంచంలోని అనేక ప్రాజెక్టులు నేడు భవిష్యత్ నవ్య రూపాన్వేషణను లక్ష్యంగా పెట్టుకున్నాయి. జీవితంలోని వివిధ అంశాలను డిజిటల్ సాంకేతికత తనలో ఎలా ఇముడ్చుకుంటుందో మనం కచ్చితంగా ఊహించలేకపోవచ్చు. కానీ దాని విస్తృత ప్రభావాన్ని మాత్రం తోసిపుచ్చలేం.

సినిమాటోగ్రఫీ

- రంగస్థల కళాకారులు తమ శక్తిమంతమైన స్వరం, భావ వ్యక్తీకరణతో ప్రేక్షకులను అలరించే వాస్తవిక కళాకారులు. సినిమాల్లో 'విజువల్ ఎఫెక్ట్స్', గళ సాంకేతికతల విస్తృత వాడకంతో పరిస్థితులు ఎంతో మారిపోయాయి. సాంకేతికత సహాయంతో మనం కృత్రిమ ప్రదేశాన్ని కూడా సృష్టించుకోవచ్చు.

చిత్ర కళ

- మధ్య శిలా యుగ గుహ చిత్ర కళ నుంచి పునరుజ్జీవనోద్యమ చిత్రాల దాక సాంకేతిక పరిజ్ఞాన వాడకం మనకెక్కడా కనిపించదు. నేటి కళా రూపం అధిక శాతం డిజిటలీకరించబడింది. కళాకారుడు హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌ల వినియోగంతో ఎలాంటి చిత్రాన్నైనా గీయగలడు. ఆభరణాలు, ఫ్యాషన్ వస్త్రాల రూపకల్పన వంటి అనేక రకాల ఆకృతులను తీర్చిదిద్దడానికి ఈ చిత్ర కళ తోడ్పడుతుంది. అనేక కళాత్మక చిత్రాలను డిజిటల్ పద్ధతిలో సృష్టించడమే కాకుండా ఏ చిత్ర కళా ప్రదర్శనలోనైనా ప్రదర్శించవచ్చు.

వాస్తు కళ

- వాస్తు కళ లేదా భవన నిర్మాణ సాంకేతికతను సాధారణంగా భారీ స్మారక చిహ్నాలు, భవనాల రూపకల్పనలో వినియోగిస్తారు. ఈ కళకు సంబంధించి అన్వేషణ నుంచి తవ్వకం దాకా డిజిటల్ సాంకేతికత అత్యంత అవసరం.

శిల్ప కళ

- ప్రాచీన కాలం నుంచి ఈ కళాకృతులను బంకమన్ను లేదా ఇతర రకాల మట్టితో రూపొందిస్తూ వచ్చారు. నేటి డిజిటల్ ప్రపంచంలో 3డీ (త్రిమితీయ) సాంకేతికతతో డిజిటల్ శిల్పాలకు ప్రాణం పోస్తున్నారు. లేదా ఏదైనా శిల్పం డిజిటల్ ముద్రను ప్రొజెక్షన్ సాంకేతిక ఆధారంగా రూపొందిస్తున్నారు. ఇందులో ఒక ఉపరితలంపై లైట్ల వినియోగం ద్వారా కాంతి ప్రసరింపజేసి మానవ లేదా ఏదైనా ఇతర రూపాన్ని సృష్టించగలరు. ఇవి కొన్ని సందర్భాల్లో చాలా వాస్తవికంగా, జీవం ఉట్టిపడేలా మన కళ్లముందు కనిపిస్తాయి. కచ్చితమైన ఆకృతిని రూపొందించడంలో ఈ సాంకేతికతను, ముఖ్యంగా లేజర్ మ్యాపింగ్ వంటిదాన్ని వినియోగిస్తారు.

నృత్య కళ

- దీనిపై డిజిటల్ ప్రపంచంలో అనేక కొత్త ప్రయోగాలు సాగుతున్నాయి. ఆ కాంతి పుంజాల ద్వారా చూడటం, మనకు వివిధ దీపకాంతుల కదలికలు అత్యంత ప్రత్యేకాదరణ ఉండగా ప్రస్తుత తరానికి ఇదెంతో సరదాగా అనిపిస్తుంది.

సంగీత కళ

- ఇది కూడా ప్రాచీన కళారూపాల్లో ఒకటి. అంతేగాక ఆబాలగోపాలాన్ని ఉర్రూతలూగించగల శక్తిగలది. ఓ గాయకుడి గళ నాణ్యత అంత మాత్రమే అయినా 'స్వయం చాలిత బాణీ' (ఆటో ట్యూన్) సాంకేతికతతో శ్రావ్యంగా మార్చవచ్చు.

'యోజన' సౌజన్యంతో..

విద్య, ఉద్యోగ సమాచారం

ట్రాన్స్‌లేటర్లు...

కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ట్రాన్స్‌లేటర్ పోస్టుల భర్తీకి నిర్వహించే కంబైన్డ్ హిందీ ట్రాన్స్‌లేటర్ ఎగ్జామినేషన్-2024 నోటిఫికేషన్‌ను ఎస్ఎస్‌సీ విడుదల చేసింది.

- **మొత్తం ఖాళీలు:** 312
- **పోస్టులు:** జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్, జూనియర్ ట్రాన్స్‌లేటర్, సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్, సీనియర్ ట్రాన్స్‌లేటర్
- **ఎంపిక:** కంబైన్డ్ హిందీ ట్రాన్స్‌లేటర్స్ ఎగ్జామినేషన్-2024 ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 25
- **వెబ్‌సైట్:** https://ssc.nic.in

మౌలానా ఉర్దూ యూనివర్సిటీలో...

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 41
- **పోస్టులు:** ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, పాలిటెక్నిక్ లెక్చరర్ తదితరాలు
- **నోట్:** వీటితోపాటు నాన్ టీచింగ్ పోస్టులకు కూడా నోటిఫికేషన్ విడుదలైంది.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **వెబ్‌సైట్:** www.manuu.edu.in

ఐకార్-సీఆర్ఐడీఏలో...

హైదరాబాద్ సంతోష్‌నగర్‌లోని ఐకార్-సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్ (సీఆర్ఐడీఏ)లో తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 4
- **పోస్టులు:** రీసెర్చ్ అసిస్టెంట్, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్, యంగ్ ప్రొఫెషనల్
- **దరఖాస్తు, చివరితేదీ తదితరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు**
- **వెబ్‌సైట్:** http://www.icar-crida.res.in

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- గ్రూప్స్: ఉద్యమ చరిత్ర, పాలిటీ బిట్స్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

ఆగస్టు 2 తరువాయి

'సత్యమేవ జయతే'ను అశోకుడు ఏ ఉపనిషత్తు నుంచి స్వీకరించారు?

డీఎస్సీ ప్రత్యేకం
ప్రాక్టీస్ టెస్ట్

121. కింది వాటిని సరైన జతలతో పూరించండి.
1. గాంధార — ఎ. గిరివ్రజ
2. అంగ — బి. తక్షశిల
3. మగధ — సి. చంప
4. కోసల — డి. శ్రావస్తి

1) 1-సి, 2-డి, 3-ఎ, 4-బి
2) 1-డి, 2-ఎ, 3-బి, 4-సి
3) 1-బి, 2-సి, 3-ఎ, 4-డి
4) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి

122. కింది వాక్యాలను గమనించండి.
ఎ. మహాజనపద కాలం నాటి కుటుంబ యజమానిని గృహపతి అని పిలిచేవారు. గృహపతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో కుటుంబ సభ్యులతో పాటు 'దాస' అనే కూలి పని వారిని, 'భ్రుతక' అనే లొంగిపోయిన సేవకుల పని చేయించేవారు
బి. రాజ్యం సిరిసంపదలతో గొప్పగా ఉండాలని రాజులు కోరుకునేవారు. దీనికి 2 మార్గాలున్నాయి. మొదటిది రాజ్యంలోని ప్రజలపై పన్నులను పెంచడం, రెండోది పొరుగు రాజ్యాలను జయించడం
సి. బింబిసారుడి నుంచి ధననందుని వరకు మగధను మహాసామ్రాజ్యంగా మలచడంలో హర్యాంక, శిశునాగ, నంద వంశ రాజులు కృషి చేశారు
డి. మహాపద్మనందుడిని 'ఉగ్రసేనుడు' అని కూడా పిలిచేవారు, చివరి నందరాజు అయిన ధననందుడిని సంహరించి బిందుసారుడు మౌర్య వంశ స్థాపన చేశాడు
పై వాక్యంలో సరికానివి గుర్తించండి.
1) ఎ, డి — 2) సి, బి
3) ఎ, బి, సి — 4) బి, సి, డి

123. కింది వాక్యాలను గమనించండి.
ఎ. అర్థశాస్త్రం రచించిన కౌటిల్యుడు బిందుసారుడు, అశోకుని దగ్గర మంత్రిగా పనిచేశాడు
బి. మగధ సామ్రాజ్యం గురించి తెలుసుకోడానికి చంద్రగుప్తుని ఆస్థానంలో గల ఇటలీ రాయబారి మెగస్తనీస్ రాసిన 'ఇండికా' ముఖ్యమైన పుస్తక ఆధారం
సి. చాణక్యుడు 'అర్థశాస్త్రం' పుస్తకంలో రాజు రాజ్యాలను ఎలా జయించాలో, ఎలా పరిపాలించాలో, రాజ్యాన్ని కుట్రలు, కుతంత్రాల నుంచి ఎలా కాపాడాలో వివిధ వృత్తుల వారి నుంచి పన్నులు ఎలా వసూలు చేయాలో, భారత ఉపఖండంలో లభించే వివిధ వనరుల గురించి వివరించాడు
డి. శాసనాల ద్వారా వర్తమానాన్ని ప్రజలకు చేరవేసిన మొదటి రాజు అశోకుడు. అతని శాసనాలు చాలా వరకు ప్రాకృత భాషలో, బ్రాహ్మీలిపిలో ఉన్నాయి
పై వాక్యాల్లో సరికానివి గుర్తించండి.
1) ఎ, సి — 2) సి, డి
3) బి, ఎ — 4) ఎ, బి, సి

124. మహాజన పదాలు వాటి రాజధానులతో పూరించండి.
1. అస్మక — ఎ. కౌశాంబి
2. కురు — బి. ఉజ్జయిని
3. వత్స — సి. ఇంద్రప్రస్థ
4. అవంతి — డి. బోధన్

1) 1-ఎ, 2-బి, 3-డి, 4-సి
2) 1-డి, 2-సి, 3-ఎ, 4-బి
3) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ
4) 1-డి, 2-ఎ, 3-బి, 4-సి

125. కింది వాక్యాలను గమనించండి.
1. అశోకుని తండ్రి బిందుసారుడు, అశోకుడు తన తాత తవ్వించిన సుదర్శన తటాకానికి మరమ్మతులు చేయించాడు
2. కళింగ రాజ్యంపై యుద్ధంలో విజయం తర్వాత తీవ్ర నైరాశ్యంలో బౌద్ధ మతాన్ని స్వీకరించి యుద్ధాలు చేయడానికి స్వస్తి పలికాడు
3. భారత జాతి సూత్రం 'సత్యమేవ జయతే'ను అశోకుని శాసనం నుంచి గ్రహించారు. అయితే ఇది ముండక ఉపనిషత్తు నుంచి స్వీకరించారు
4. ధమ్మ అనే ప్రాకృత పదానికి సంస్కృతంలో సమాన పదం - ధర్మం
పై వాక్యాల్లో సరికానిది గుర్తించండి.
1) 1, 2 — 2) 3, 4
3) 1, 2, 3 — 4) ఏవీకావు

126. బౌద్ధమతానికి సంబంధించి కింది వాక్యాలను గమనించండి.
ఎ. బౌద్ధ ధర్మ పవిత్ర గ్రంథాలను పీటికాలు అంటారు. అవి సుత్త, వినయ, అభిధమ్మ
బి. గౌతమ బుద్ధుడు, ఇతర బౌద్ధ మత సన్యాసుల అవశేషాలపై నిర్మించిన గుండ్రని ఆకార నిర్మాణాలను స్థూపాలు అంటారు
సి. బౌద్ధ మత ప్రార్థనా మందిరాలను చైత్యాలు అంటారు
డి. బౌద్ధ సన్యాసులు నివసించే ప్రదేశాలను విహారాలు అంటారు
పై వాక్యాల్లో సరికానివి గుర్తించండి.
1) ఎ, డి — 2) సి, ఎ
3) ఎ, బి, సి, డి — 4) ఏవీకావు

127. శాతవాహనులకు సంబంధించి కింది వాక్యాలను గుర్తించండి.
ఎ. శాతవాహనుల తొలి రాజధాని కోటిలింగాల, ఇది ప్రస్తుత తెలంగాణలోని కరీంనగర్ జిల్లాలో ఉంది
బి. ఈ వంశ స్థాపకుడు శ్రీముఖుడు, 23వ రాజు గౌతమీ పుత్ర శాతకర్ణి
సి. యజ్ఞశ్రీ శాతకర్ణి కాలంలో నాగార్జున విశ్వవిద్యాలయం ఏర్పాట్లు జరిగాయి
డి. శాతకర్ణి III శాతవాహనుల్లో చివరి రాజు
పై వాక్యాల్లో సరైనది గుర్తించండి.
1) బి, డి — 2) బి, సి, డి
3) ఎ, సి, డి — 4) ఎ, బి, సి, డి

128. ఇక్ష్వాకులకు సంబంధించి కింది వాక్యాలను గమనించండి.
ఎ. ఇక్ష్వాకులు రాజధాని విజయవాడ నుంచి పాలించారు
బి. వీరు రామాయణంలోని రాముని వంశానికి చెందిన వారమని చెప్పుకొన్నారు
సి. ఇక్ష్వాకు కుటుంబాల్లో మహిళలు బౌద్ధ గురువులను ఆరాధిస్తూ బౌద్ధ ఆరామాలు, స్థూపాల నిర్మాణానికి విరివిగా దానాలు ఇచ్చారు
డి. వీరి కాలంలో అశ్వమేధ, వాజపేయ యాగాలు చేసి బ్రాహ్మణులకు దానాలు చేసేవారు
పైవాటిలో సరైనవి గుర్తించండి.
1) ఎ, బి — 2) బి, సి
3) బి, సి, డి — 4) ఎ, బి, సి, డి

129. ప్రాచీన కాలంలో భారతదేశం ఎక్కడ ఉంది?
1) ఉత్తరార్ధ గోళం — 2) దక్షిణార్ధ గోళం
3) పశ్చిమార్ధ గోళం
4) తూర్పు అర్ధగోళం

130. భూమి వాస్తవ ఆకారం?
1) గోళాకారం — 2) గుండ్రం
3) జియోయిడ్ — 4) బల్లపరుపు

131. ఉజ్జయిని, శ్రీలంక, రోహితక్‌ల నుంచి మధ్యాహ్నరేఖలు పయనిస్తాయని తెలిపింది?
1) ఆర్యభట్ట
2) వరాహమిహిరుడు
3) టాలమీ — 4) కొపర్నికస్

132. వస్తుమార్పిడి విధానం స్థానంలో మార్పిడి మాధ్యమంగా మొదట దీన్ని ఉపయోగించారు.
1) లోహాలు — 2) కరెన్సీ నోట్లు
3) చెక్కులు — 4) ధాన్యం

133. నగదు తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండా మన ఖాతా నుంచి చెల్లింపులు చేయడానికి వీలు కల్పించే బ్యాంకింగ్ సౌకర్యం?
1) ఏటీఎం — 2) క్రెడిట్ కార్డ్
3) డెబిట్ కార్డ్ — 4) ఫోన్ బ్యాంకింగ్

134. రియల్ టైమ్ గ్రాస్ సెటిల్‌మెంట్ ద్వారా నగదు బదిలీ కనీస గరిష్ఠ పరిమితి?
1) రూ. లక్ష నుంచి 5 లక్షలు
2) రూ. 2 లక్షలు - 5 లక్షలు
3) రూ. 1 లక్ష నుంచి 10 లక్షలు
4) రూ. 2 లక్షల నుంచి గరిష్ఠ పరిమితి లేదు

135. పల్లె ప్రాంతంలో రోజుకి తీసుకునే ఆహారంలో ఉండాల్సిన కనీస క్యాలరీలు ?
1) 2000 కిలో క్యాలరీలు
2) 2100 కిలో క్యాలరీలు
3) 2200 కిలో క్యాలరీలు
4) 2400 కిలో క్యాలరీలు

136. పేదవారికే ప్రజా పంపిణీ ద్వారా సరుకులు చౌకధరకు అందించే విధానం అమలులోకి వచ్చిన సంవత్సరం?
1) 1995 — 2) 1996
3) 1997 — 4) 1999

137. అంత్యోదయ కార్డు ద్వారా నెలకు సరఫరా చేసే ఆహారధాన్యాలు?
1) 25 కిలోలు — 2) 30 కిలోలు
3) 35 కిలోలు — 4) 40 కిలోలు

138. కింది వాటిలో సరైన జతలను గుర్తించండి.
ఎ. విద్యా- సాంస్కృతిక హక్కు - ప్రకరణ 29 నుంచి 30 వరకు
బి. పీడనాన్ని నిరోధించే హక్కు - ప్రకరణ 24 నుంచి 25 వరకు
సి. స్వేచ్ఛా హక్కు - ప్రకరణ 19 నుంచి 22 వరకు
డి. మతస్వాతంత్ర్యపు హక్కు - ప్రకరణ 26 నుంచి 28 వరకు
1) ఎ, బి, సి — 2) బి, డి
3) ఎ, బి, సి, డి — 4) ఎ, సి

139. కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ. భారతదేశంలో ఎన్నుకోబడిన ప్రతినిధులు శాసనసభలో భాగం
బి. జాన్ మథాయ్ భారతదేశ మొదటి ఆర్థిక మంత్రి
సి. ఫెడరలిజం అంటే దేశంలో ఒకటి కంటే ఎక్కువ స్థాయిల్లో ప్రభుత్వం ఉనికిని కలిగి ఉండటం
డి. 1934లో ఐఎన్‌సీ మొదటి రాజ్యాంగ సభ కోసం డిమాండ్ చేసింది
1) ఎ, బి — 2) ఎ, సి
3) బి, సి — 4) ఎ, బి, సి, డి

140. రాజ్యాంగాన్ని రూపొందించేటప్పుడు భారతదేశ నాయకులను కింది వాటిలో ప్రేరేపించిన అంశం?
1) ఫ్రెంచ్ విప్లవ ఆదర్శాలు
2) యుఎస్ హక్కుల బిల్లు
3) బ్రిటన్‌లో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం
4) పైవన్నీ

ట్రైమెథడ్స్

141. సజాతి భిన్నాలకు ఉదాహరణ ఇవ్వండి. అనే ప్రశ్నకు సాధించే లక్ష్యం?
1) జ్ఞానం — 2) అవగాహన
3) వినియోగం — 4) నైపుణ్యం

142. 9[]5 బాక్స్‌లో సరైన గుర్తును (<)(>)(=) ఉంచండి. అనే ప్రశ్న ద్వారా సాధించే విద్యా ప్రమాణం?
1) సమస్యా సాధన
2) అనుసంధానం
3) వ్యక్త పరచడం
4) దృశ్యీకరణ - ప్రాతినిధ్య పరచడం

143. కింది వాటిలో జ్ఞానాత్మక రంగానికి చెందిన విద్యా ప్రమాణం?
1) విషయ అవగాహన
2) సమాచార సేకరణ - ప్రాజెక్ట్ పనులు
3) జీవవైవిధ్యం పై సున్నితత్వం, నిజజీవిత అన్వయం
4) ప్రశ్నించడం - పరికల్పనలు చేయడం

144. గాలిలో ధ్వని వేగాన్ని కనుగొనడానికి సరైన ప్రయోగ విధానాన్ని ఎన్నుకోగలిగిన విద్యార్థిలో నెరవేరిన లక్ష్యం?
1) జ్ఞానం — 2) అవగాహన
3) వినియోగం — 4) నైపుణ్యం

145. నీడలు ఏర్పడటానికి కారణాలు తెలిపిన విద్యార్థిలో నెరవేరిన లక్ష్యం?
1) జ్ఞానం — 2) అవగాహన
3) వినియోగం — 4) నైపుణ్యం

146. LEP ఎవరి మార్గదర్శకాలను ఆధారంగా చేసుకొని ఏర్పడింది?
1) APSCF 2011
2) RTE 2009
3) NCF 2005 — 4) NPE 1986

147. రాష్ట్రపతి, గవర్నర్ అధికారాల మధ్య పోలికలు, భేదాలు రాయండి? అనే ప్రశ్నతో పరీక్షించే లక్ష్యం?
1) జ్ఞానం — 2) అవగాహన
3) వినియోగం — 4) నైపుణ్యం

148. గణితం విద్య ముఖ్య ఉద్దేశం. పిల్లల్లో గణితీకరణ సామర్థ్యాలను అభివృద్ధి చేయడం లేదా పిల్లల ఆలోచనా ప్రక్రియలను గణితీకరించడం అని తెలిపింది?
1) APSCF - 2011
2) NCF 2005
3) RTE 2009 — 4) NPE 1986

జవాబులు

121.3	122.1	123.4
124.2	125.4	126.4
127.2	128.3	129.2
130.3	131.1	132.4
133.3	134.2	135.4
136.3	137.3	138.4
139.4	140.4	141.2
142.3	143.4	144.3
145.3	146.3	147.2
148.3		

ప్రాక్టీస్ బిట్స్ రూపొందించిన వారు
సోషల్ - కళ్యాణ్ గౌడ్
ట్రైమెథడ్స్ - రవికుమార్
ఏకేఆర్ స్టడీ సర్కిల్, వికారాబాద్